# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

మంగళవారం | 27 | జూన్ | 2023 | పేజీలు : 8


## మాదకద్రవ్యాల నివారణే
# ఉత్తమ మార్గం
### కరీంనగర్ కలెక్టర్ కర్ణన్






కరీంనగర్ బ్యూరో, జూన్ 26 (మనం న్యూస్)ః మాదకద్రవ్యాలను నిర్మూలించడం కన్న నివారణే ఉత్తమ మార్గమమని కలెక్టర్ ఆర్వి .కర్ణన్ తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై కళంకం, వివక్షను ఆపండి, నివారణను బలోపేతం చేయండి అనే థీమ్ తో సోమవారం ఉదయం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్ణన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలనే డ్రగ్స్ కేవలం పౌడర్, లిక్విడ్ రూపంలో మాత్రమే లభించేవి కావని, వ్యాధుల కొరకు తీసుకునే మందులలో కూడా డ్రగ్స్ ఉంటుందన్నారు. స్నేహితుల ద్వారా సరదాగా మొదలై ఖచ్చితమైన అలవాటుగా రూపాంతరచెంది, వారితో పాటు వారి కుటుంబాలను కూడా నాశనం చేస్తాయన్నారు. కొన్ని రకాల వ్యాధుల కొరకు వాడే మందులలో కూడా డ్రగ్స్ ఉంటుందని, వాటిని మోతాదుకు మించి తీసుకోవడం సమస్యలను కొనితెచ్చుకోవడమేనన్నారు. డ్రగ్స్‌ను నివారించే క్రమంలో ఎప్పటికప్పుడు పోలీసు, ఇతర అధికారులు అప్రమత్తంగా ఉండడంతో పాటు స్కూళ్లు, కాలేజిల వద్ద అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో సరిపోదని, డ్రగ్స్ పిల్లల దరిచేరకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, వాటిని దూరం చేయడంలో తల్లితండ్రుల బాద్యతకూడా ఎక్కువగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సామాజిక మాద్యమాలలో నేటి యువత చురుకుగా పాల్గొంటోందని, దానిని సక్రమంగా వాడుకోవడం వలన ఐఎఎస్, ఐపిఎస్ వంటివి సాదించడానికి వినియోగించుకోవచ్చని అన్నారు. సామాజిక మాద్యమాలలో అనుచిత వ్యక్తులు, మోసపూరిత ప్రకటనలపై జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. అదే విధంగా డ్రగ్స్ ను వాడే వారిని చిన్నచూపు చూడకుండా వారి సమస్యను అర్థంచేసుకొని దాని నివారణకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణ పోస్టర్ ఆవిష్కరించి, ద్రవ్య నియంత్రణకు పాటుపడతామని యువత, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. సిపి సుబ్బారాయుడు మాట్లాడుతూ నేటి సమాజంలో డ్రగ్స్ ఓ భాగమైపోయిందని, డగ్స్ ను నివారించడంలో అధికారులతో పాటు పిల్లల తల్లితండ్రుల బాధ్యత కూడా ఉన్నప్పుడే నిర్మూలించగలమని తెలిపారు. నేరాలు పెరిగిపోవడంతో కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయని, నేరాల వైపు ప్రోత్సహించే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే ఆలోచన ప్రతిఒక్కరిలో కలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఓ సబితా, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లు భేష్
### కేంద్ర ఎన్నికల సంఘం ఈవిఎం నోడల్ ఆఫీసర్ కావ్లే



కరీంనగర్, జూన్ 26 ( మనం న్యూస్)ః రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతూ కరీంనగర్ జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం చేస్తున్న ఏర్పాట్లు బాగున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం ఈవిఎం నోడల్ ఆఫీసర్ అబాసాహెబ్ ఆత్మారామ్ కావ్లే అన్నారు. కరీంనగర్ లోని ఈవియం గోడౌన్ లో రానున్న ఎన్నికల కొరకు నిర్వహిస్తున్న ఈవియం ఎఫ్ఎల్ సి, వెబ్ కాస్టింగ్ గదులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని కరీంనగర్ జిల్లాలో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో చేపడుతున్న ఎఫ్ఎల్ సి, ఎన్నికల ఏర్పాట్లు ఈసీఐ నిబంధనల ప్రకారం బాగున్నాయని తెలిపారు. ఎఫ్ఎల్ సి నిర్వహణ, ఈవియంలో గోడౌన్ లోకి ప్రవేశించడం మొదలుకొని ఈవియం బ్యాలెట్ యూనిట్, కంట్రోలింగ్ యూనిట్, వివిపాట్ యంత్రాల మొదటి దశ చెకింగ్ ప్రక్రియ, మాక్ పోల్ నిర్వహణ, ఈవియంలను భద్రపరిచే గదిని, సమస్యలు తలెత్తిన వాటిని వేరుగా భద్రపరచడం, సిసి కెమెరాల ద్వారా నిర్వహిస్తున్న వెబ్ కాస్టింగ్, అలారం, భద్రత సిబ్బంది, వ్యారికేటింగ్ తదితర విషయాలను పరిశీలించడంతో పాటు పలువిషయాలను గురించి జిల్లా కలెక్టర్, సిపిలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్, సిపి సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్ లు జి.వి. శ్యాంప్రసాద్ లాల్, గరిమా అగర్వాల్, శిక్షణ సంయుక్త కలెక్టర్ నవీన్ నికోలస్, కరీంనగర్ ఆర్డిఓ ఆనంద్ కుమార్,ఏ ఓ జగత్ సింగ్, వివిద రాజకీయ పార్టీల ప్రతినిధులు మోహనా చారి, మిలుకూరి వాసుదేవ రెడ్డి, గాలి అనిల్ కుమార్, సత్తినేని శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## కర్రే ఊతం..
# ప్రాణాలే ఫణం

కొమురంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 26 (మనం న్యూస్)ః ఈ చిత్రం చూడగానే బావిలో పడిపోయిన కర్రను బయటకు తీస్తున్నారని అనుకుంటే పొరపాటే..! కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల తాగునీటి కష్టాలకు నిదర్శనమిది. తిర్యాణి మండలంలోని గుండాల గ్రామం ఏడు గూడేల సముదాయం. 1542 మంది జనాభా ఉన్న ఈ గ్రామానికి రెండు, మూడు రోజులకోసారి మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుంది. పైపులైను చెడిపోవడంతో పక్షం రోజుల నుంచి అదీ కరవైంది. దీంతో పురాతన బావిలోంచే ఇలా ప్రమాదకరంగా కర్ర సాయంతో నీరు తోడుకుంటూ అవసరాలు తీర్చుకుంటున్నారు

# కెసిఆర్ సభను
# విజయవంతం చేయాలి

7 లో



## ఘనంగా ప్రారంభమైన పఠనోత్సవం

### హాజరైన మున్సిపల్ చైర్మన్



కొత్తపల్లి, జూన్ 26 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుండి 31 వరకు నిర్వహిస్తోన్న పఠనోత్సవ కార్యక్రమాన్ని కొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు అచ్యుత రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అంకితభావంతో 'చదవడం నేర్చుకోవాలని, నేర్చుకోవడానికి చదవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోన్న ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పఠనా సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు అందరి చేత సామూహికంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పాఠ్యాంశాలను చదివించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ బారీ, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ ఎస్ కె.బాబా, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నదాతల ఆర్థికాభివృద్ధి కోసమే రైతు బంధు

### సింగిల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి



చిగురుమామిడి, జూన్ 26 (మనం న్యూస్): రైతులు ఆర్థికాభివృద్ధి చెందాలన్న లక్ష్యంలో, రైతుల సంక్షేమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ ప్రతి పంటకు రైతు బంధును అందిస్తున్నారని చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుబంధు పథకంలో భాగంగా ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎకరానికి 5వేల చొప్పున విడతలవారీగా వారి ఖాతాలలో జమ చేస్తున్నారన్నారు. దేశాని కి ఆదర్శంగా నిలిచిన రైతు బంధు పథకాన్ని వినియోగించుకుని తెలం గాణ రైతాంగం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంతో దోహదపడు తుందన్నారు. చిగురుమామిడి సింగిల్ విండో లో విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ రబీ సీజన్లో ప్రాథమిక వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో 3వేల604 మంది రైతుల ద్వారా 12 సెంటర్లలో లక్షా 78వేల క్వింటాల్ల వరి ధాన్యం సేకరించి పూర్తిస్థాయిలో చెల్లింపులు చేయడం జరిగిందని తెలిపారు.

## మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీ



ఇల్లందకుంట, జూన్ 26 (మనం న్యూస్): మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఎస్సై తోట తిరుపతి, ఇల్లందకుంట జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి మాట్లాడుతూ ప్రమాదకరమైన డ్రగ్స్ వల్ల ఏర్పడే అనర్థాల పట్ల అవగాహన కల్పిస్తే యువత ఆ వైపు మళ్లకుండా నిరోధించవచ్చన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేదే యువత అని ఆ యువతను సరియైన దారిలో పెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కవ్వంపల్లి పొలిటికల్ బ్రోకర్

### నాలుగు పార్టీలు మారిన చరిత్ర ఆయనదే

### బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారావు



మానకొండూరు, జూన్ 26 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యానారాయణ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆయన నాలుగు పార్టీలు మారే పొలిటికల్ బ్రోకర్ అని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణారావు విమర్శించారు. సోమవారం మానకొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కవ్వంపల్లి ఎలాంటి అవగాహన లేకుండా బిఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. గతంలో తెలంగాణ ఏర్పడక ముందు గ్రామాల్లో మండుటెండల్లో ఎక్కడైనా చెరువుకుంటల్లో నీరు ఉండేదా అని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చాక మండుటల్లో సైతం చెరువుకుంటలో సాగు నీరు ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక గొప్ప ప్రాజెక్టుగా అభివర్ణిస్తూ, గత కాంగ్రెస్ హయాంలో పివి.నరసింహారావు ప్రధాన మంత్రి అయినా కూడా వరద కాలువ పనులు ముందుకు సాగలేదని గుర్తు చేశారు. మిడ్ మానేర్, అప్పర్ మానేర్, మోతే, రంగనాయక స్వామి, బస్వాపూర్, అనంతగిరి, మల్లన్న సాగర్ ఎవరు కట్టించారని ప్రశ్నించారు. గతంలో ఎల్ఎండి ప్రాజెక్టు కింద కేవలం 66 వేల ఎకరాలు మాత్రమే సాగు అయ్యేదని, కానీ తెలంగాణ వచ్చాక 1లక్ష 32 వేలు ఎకరాలు సాగు అవుతుందని, దీనిని రూపకల్పన చేసింది కేసీఆర్ కదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలక్ట్రిసిటీలో 22 వేల ఉద్యో గాలు, పోలీస్ శాఖలో 20వేల ఉద్యోగాలు, ఇండి పెండెంట్ ఇచ్చామని టీఎస్పిఎస్సి ద్వారా లక్ష ఉద్యోగాలు కల్పించామన్నారు. డబ్బులు ఇస్తేనే కాంగ్రెస్ జమానాల్లో ఉద్యోగాలు ఇచ్చేవారని హేళన చేశారు. యువ నాయకుడు కేటీఆర్ 104 ఐటి కంపెనీలు రాష్ట్రానికి తెచ్చాడని అన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉన్న సత్యనారాయణ ప్రైవేట్ గా ఆస్ప త్రి పెట్టి ఏ విధంగా వైద్యం అందిస్తున్నవో ప్రాసిక్యూట్ చేయాల్సింది ఉందన్నారు. తెలంగాణ గవర్నమెంట్ లో ఇప్పటివరకు 33 మెడికల్ కాలేజీలు తీసుకువచ్చామని, కాంగ్రెస్ హయాంలో ఒక్క మెడికల్ కాలేజీ తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 4 మెడికల్ కాలేజీల్లో 4000 మంది వైద్య విద్యార్థులను రిక్రూట్మెంట్ చేసుకున్నది కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. సత్యనా రాయణ ఆయన స్వగ్రామం పచ్చునూరులో ఎన్ని రోజులు నిద్రపోయాడని గ్రామానికి ఏం సేవ చేశాడని మండిపడ్డారు. ఆయన కేవలం రాజకీయం కోసమే హైదరాబాద్ నుంచి ఇక్కడికి వచ్చారని, రసమయి బాలకిషన్ స్థానికేతరుడైతే స్థానికుడైన కవ్వంపల్లి ఎందుకు ఓడిపోయారని, రేవంత్ రెడ్డి కొడంగల్ అయితే హైదరాబాద్ నుంచి ఎందుకు పోటీ చేశారని, మెదక్ నుంచి ప్రియాంక గాంధీ ఏ విధంగా పోటీ చేస్తుందని, మరి వీళ్ళు స్థానికులా అని ప్రశ్నిం చారు. కవ్వంపల్లికి దమ్ముంటే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల్లో అవినీతి ఉంటే కోర్టులో రిట్ పిటిషన్ వేసుకోవాలని జివి సవాల్ విసిరారు.



## విద్యుత్ శక్తి రంగంలో అపార ఉపాధి అవకాశాలు

### కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్

హుజురాబాద్ రూరల్, జూన్ 26 (మనం న్యూస్): విద్యుత్ శక్తి రంగమనేది ప్రజలు, పారిశ్రామిక అవసరాలను తీర్చే ఒక ముఖ్యమైన సాధనమని, ఈ రంగంలో అపార ఉపాధి అవకాశాలు ఉన్నాయని కమల ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శంకర్ పేర్కొన్నారు. సింగపురం లోని కిట్స్ కళాశాలలో సోమవారం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగ విద్యార్థులు నిర్వహించిన కృతజ్ఞతా సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సాంప్రదాయేతర ఇంధన వనరులైన సూర్య రశ్మి, పవన విద్యుత్తులను ఉత్పత్తికి ఎంతో ప్రాధాన్యత ఇవ్వబడుతున్నదని, రవాణా రంగంలో పెట్రోలు, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రికల్ వెహికల్స్ వస్తున్న నేపథ్యంలో ఎంతో ఉపాధి అవకాశాలు ఉంటాయని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు శాస్త్రీయ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు విద్యుత్ శక్తి రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయని విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యములను పెంచుకోవాలని ఉద్బోధించారు. వాతావరణ కాలుష్య కారకాలైన కార్బన్‌డయాక్సైడ్ , కార్బన్ మోనాక్సైడ్‌లను తగ్గించేందుకు జరుగుతున్న కృషిలో భాగంగా సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ లకు ప్రాముఖ్యత లభిస్తుందన్నారు. క్యాంపస్ ప్లేస్మెంట్స్ ద్వారా ఇప్పటికే ఉద్యోగం సాధించిన విద్యార్థులను డాక్టర్ శంకర్ ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం విద్యార్థులు తాము కళాశాలలో పొందిన అనుభూతులను పంచుకున్నారు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో తమకు బోధించిన అధ్యాపకులతో ఉన్న అనుబంధాన్ని ఒక్కొక్క విద్యార్థి వివరిస్తున్నప్పుడు ఉద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, విభాగాధిపతి డాక్టర్ యోగేష్ యశ్వంత్ పుండలిక్, రిజిస్టర్ పి వెంకటయ్య , ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారిణి డాక్టర్ విజయలక్ష్మి, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ అధ్యాపకుడు డాక్టర్ డి. వేణుగోపాల్ , ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్ అభిషేక్ రెడ్డి, అకాడమిక్ కో-ఆర్డినే టర్ జి.మల్లయ్య, వివిధ విభాగాల అధిపతులను, అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

## యువత డ్రగ్స్‌కు బానిసలైతే సమాజమే వెనుకంజ వేస్తుంది

### ఎసిపి వెంకట్ రెడ్డి



హుజురాబాద్ రూరల్, జూన్ 26 (మనం న్యూస్): దేశానికి మూల స్తంభాలు యువత, విద్యార్థులేనని వారు మాదకద్రవ్యాలకు అలవాటు పడి బానిసలైతే ఆ సమాజం వెనుకడుగు వేస్తుందని హుజురాబాద్ ఏసిపి కోట్ల వెంకటరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని సోమవారం హుజురాబాద్ పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు అలవాటుగా మారితే ఆ సమాజం తిరోగమనం దిశగా ప్రయాణిస్తుందన్నారు. దేశ భవిష్యత్తుకు అడ్డం పడే మాదకద్రవ్యాల వినియోగాన్ని సామాజిక రుగ్మతగా భావించి ప్రతి ఒక్కరూ పకడ్బందీగా అడ్డుకోవడానికి ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ నిరోధానికి కృషి చేస్తున్న పోలీసులకు సహకరించాలన్నారు. యువతలో మొదట మద్యపానం ధూమపానంతో మొదలై సరదాగా మాదకద్రవ్యాలకు బానిసలు అవుతారని, తర్వాత అది అలవాటుగా మారుతుందని మత్తులో తామేం చేస్తున్నామో తెలియని పరిస్థితిలో ఉంటారన్నారు. యువత విద్యార్థులు ఈ అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో హుజురాబాద్ టౌన్ సిఐ బొల్లం రమేష్, సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు సత్య ప్రసాద్, ఆసియా, సొల్లు సారయ్య, రాములు, నందం తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై ప్రజా ప్రతినిధులే అవగాహన కల్పించాలి

### టిబిఎస్ఎస్ అధ్యక్షులు రాజలింగు

రామకృష్ణాపూర్,జూన్ 26 (మనం న్యూస్): డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదేనని తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, అడ్వకేట్ మోతే రాజలింగు అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతు 1985 నార్కోటిక్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్ చట్టం ప్రకారం మాదక ద్రవ్యాలు వాడటం, కలిగి ఉండటం, సరఫరా, ఉత్పత్తి చట్టరీత్యా నేరమైనప్పటికీ, నేటికీ మన దేశంలో విచ్చలవిడిగా డ్రగ్స్ దొరుకుతూ, వాటి వాడకం పెరుగుతూనే ఉన్నాయన్నారు. ఇంతటి ప్రమాదకరమైన సమస్య రోజురోజుకు తీవ్రమవుతున్నప్పటికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. సగటున 9 నుండి 10 సంవత్సరాల వయస్సు గల పేద,బడుగు బలహీన వర్గాల పిల్లలతో పాటు యువత డ్రగ్స్ ను సేవించి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం డ్రగ్స్ వాడడం వలన వారి భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. దీనిని అరికట్టేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాలతో దేశ ఆరోగ్యం,ఆర్థిక పరిస్థితిలపై ప్రభావం పడుతుందన్నారు.ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని..
## గ్రామపంచాయితీ కార్మికుల నిరసన ర్యాలీ




సిరిసిల్ల టౌన్, జూన్ 26 (మనం న్యూస్)ః తాము ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయితీ కార్మికులు సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్బంగా కాలేజి గ్రౌండు నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా జె ఏ సి రాష్ట్ర కన్వీనర్ చాగంటి వెంకటయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్బంగా సఫాయి అన్న సలాం అంటూ కార్మికుల కుటుంబాలను వేతనాలు ఇవ్వకుండా పస్తులుంచుతున్నారని విమర్శించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో వచ్చే నెల 6వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు ఎగమంటి ఎల్లారెడ్డి , కోడం రమణ, నాయకులు ముషం రమేష్ ,మోర అజాయ్ ,ఎలిగేటి రాజశేఖర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, మండల అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ , నాయకులు జెల్లీ లక్ష్మణ్ , కాసర్ల భూపాల్ , సందెలా మహేష్ , గూడెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన డిఇవో



జగిత్యాల, జూన్ 26 (మనం న్యూస్)ః విద్యార్థుల వివరాలతో పాటు పాఠశాలకు సంబంధించిన వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేసేందుకు వీలుగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు డిఇవో డాక్టర్ జగన్మోహన్ రెడ్డి సోమవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. స్థానిక టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మొదటి రోజు 270 ట్యాబ్ లను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, సంజీవ్, దేవేందర్ రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## వాగేశ్వరి కళాశాలలో అలరించిన ప్రెషర్స్ డే వేడుకలు




తిమ్మాపూర్, జూన్ 26 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ లోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కళాశాలల చైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాత, కొత్త విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంలో ప్రెషర్స్ డే వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుతమున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుంటేనే రాణించగలరన్నారు. ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు మంచి అవకాశాలున్నాయని, వాటికి అనుకూలంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపోందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యాదర్శి డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్, సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎన్.చంద్రమౌళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలల బంద్ విజయవంతం

### ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్

కరీంనగర్, జూన్ 26 (మనం న్యూస్)ఃప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తూ పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ పంపిణీ చేయడంతో పాటు ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులతో పాటు ఎంఇవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన పాఠశాలల బంద్ కార్యక్రమం విజయవంతమైందని ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్యాల రాకేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన పాఠశాలల బంద్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌కు విద్యార్థిని, విద్యార్థులు, పాఠశాలల నిర్వాహకులు స్వచ్ఛందంగా మద్ధతు తెలిపారన్నారు. తెలంగాణ ఏర్పడి దశబ్ది కాలం గడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేక ఉపాధ్యాయ కొరత ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పట్ల సవతి ప్రేమ చూపిస్తూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ పాఠ్యపుస్తకాలు యూనిఫారంలు మొదలుకొని ఇష్టానుసారంగా విద్యను పూర్తిగా వ్యాపారంగా మారుస్తున్న అధికారుల మౌనం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. ఇకనైనా ప్రైవేట్ పాఠశాలలకు వత్తాసు పలకడం మానుకొని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలల పైన చట్టరీత్యా చర్యలు తీసుకొని వాటి గుర్తింపు రద్దుచేసి ఫీజుల నియంత్రణ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తూ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందిని వెంటనే నియమించాలని, మూతపడిన ప్రభుత్వ



పాఠశాలను తిరిగి ప్రారంభించాలని, పాఠశాలల్లో ల్యాబ్ లు లైబ్రరీలు సంబంధించిన ఎక్విప్మెంట్స్ తో ఏర్పాటు చేసి పేద మధ్యతరగతి విద్యార్థులకు తోడ్పడే విధంగా పూర్తిస్థాయిలో విద్యను అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణు, నందు, జోనల్ ఇన్చార్జులు నితీష్, శ్రీవర్ధన్, నగర సంయుక్త కార్యదర్శులు రాకేష్, వంశీ, సంహిత్, కార్యకర్తలు సిద్ధార్థ ప్రదీప్ మధు రంజిత్ శేషాద్రి అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ధర్నా




సిరిసిల్ల టౌన్, జూన్ 26 (మనం న్యూస్)ః ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద అనిల్ కుమార్, మల్లారపు ప్రశాంత్ లు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందించలేదన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు కేటాయించి నాణ్యమైన భోజనం అందించాలని, ఖాళీగా ఉన్న టీచర్,ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని, మన ఊరు మనబడి పథకం అన్ని పాఠశాలలు చేర్చాలని, బీసీ వసతి గృహప్రవేశాలను ఆన్లైన్ పద్ధతి రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాలు యూనిఫామ్ లు అమ్ముతూ విద్యను వ్యాపారం చేస్తున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థులు అందరికీ కలుపుకొని భవిష్యత్తులో తీవ్ర ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుండెల్లి కళ్యాణ్ కుమార్, నాయకులు జాలపల్లి మనోజ్ కుమార్, కుర్ర రాకేష్, జిల్లా నాయకులు పెండేల ఆదిత్య, పందుల రామ్ చరణ్, అరవింద్, వేణు రోహిణి, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

సుల్తానాబాద్,జూన్ 26 మనం న్యూస్ ః సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో జరిగిన సమావేశంలో సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెండవ ఉప గవర్నర్ లయన్ సింహరాజు కోదండరాం అధ్యక్షులుగా నోముల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా ఆడెపు సమ్మయ్య, కోశాధికారిగా రాయల్ల నవీన్ ఎన్నికైన ఇతర కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ రానున్న కాలంలో సభ్యులందరి సహకారంతో మంచి సేవా కార్యక్రమాలు చేస్తూ క్లబ్‌ను జిల్లా స్థాయిలో ఉన్నతంగా నిలపడానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటరమణరెడ్డి, అడిషనల్ కార్యదర్శిలు వలస నీలయ్య, మధుసూదన్‌రెడ్డి,మోర బద్రేశం ,రీజియన్ చైర్మన్ గట్టు రాజయ్య,జోన్ చైర్మన్ క్రిష్ణ కిషోర్,డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్లు మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్,మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్ ,సీనియర్ సభ్యులు గజభీమ్కార్ జగన్,కొమురవెల్లి చక్రధర్,దీకొండ భూమేష్ కుమార్,కోడూరి సతీష్‌కుమార్,పిట్టల వెంకటేష్,కట్ల సంపత్,పోచంపల్లి పోచమల్లయ్య, కౌశిక్,నూతన సభ్యులు తమ్మనవేణి సతీష్,పూసాల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమ ద్రోహులతో కలిసి కెసిఆర్ పాలన సాగిస్తున్నారు

### ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకించిన వారే చట్ట సభల్లో ఉన్నారు

### హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి



చిగురుమామిడి, జూన్ 26 (మనం న్యూస్): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకిస్తూ, ఉద్యమ ద్రోహులుగా పేరుగాంచిన వారిని పక్కనబెట్టుకుని సిఎం కెసిఆర్ పాలన సాగిస్తున్నారని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావానికి వ్యతిరేకంగా పనిచేసిన వారే బిఆర్ఎస్ తరపున మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా చట్ట సభల్లో కొనసాగుతుండడం దురదృష్టమన్నారు. పల్లె పల్లెకు ప్రవీణన్న, గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం చిగురు మామిడి మండలం నవాబుపేట్ గ్రామంలో ఆయన పర్యటించారు. మొదటగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన ప్రవీణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నెరవేర్చబోయే హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని, అలాంటి కాంగ్రెస్ పార్టీ ని కేసీఆర్ బంగాళాఖాతంలో తొక్కుతానని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. తెలంగాణ ద్రోహులను, వ్యతిరేకులను పార్టీ లోకి చేర్చుకొన్న కేసీఆర్, వారిని మంత్రులను చేశారన్నారు.

మాయ మాటలు చెప్పి తెలంగాణ ప్రజానీకాన్ని మోసం చేసి అధికారంలోకి వచ్చి, ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రమే రైతులకు సరైన న్యాయం జరిగిందని ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంత రైతుల సంక్షేమం కోసం ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని, స్థానికేతరుడైన ఎమ్మెల్యేకు కూడా ఇక్కడి రైతుల గోస పట్టడం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే కర్ణాటక ప్రభుత్వం అమలు చేస్తున్న తరహా లో మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఏక కాలంలో రూ. 2 లక్షల రైతు రుణ మాఫీ చేస్తామని, 5వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, సొంత స్థలంలో ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయల సాయం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 5 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. ఇంట్లో ఇద్దరు వృద్ధులుంటే కనీస పించన్ ఐదు వేల రూపాయలు అందించడంతో పాటు అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ధరణి పోర్టల్ ను రద్దు చేస్తామని, భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు ఎకరానికి రూ. 15 వేల సాయం, భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు రూ. 12 వేల సాయం అందిస్తామని ప్రవీణ్ రెడ్డి తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని అధికారం లోకి తీసుకువచ్చి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు యువకులకు ప్రవీణ్ రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల రవి, అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, చిగురు మామిడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంది తిరుపతి రెడ్డి, నవాబు పేట్ గ్రామ శాఖ అధ్యక్షులు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు షాబొద్దీన్, కిసాన్ సెల్ అధ్యక్షులు కాంతాల మహిపాల్ రెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు పొన్నం సంపత్ , మహిళ నాయకురాలు ఓరుగంటి భారతి దేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల లచ్చి రెడ్డి, కూతురు రవిందర్ రెడ్డి, ఠాకూర్ నరేందర్ సింగ్, మేకలపరశురాములు, కోనేటి రాములు, యూత్ కాంగ్రెస్ నాయకులు రెడ్డి యాదగిరి, వార్డు మెంబర్ మాడ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొల్లూరి రాజు, ఇందుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు చింత పూల నరేందర్, రేకొండ గ్రామ శాఖ అధ్యక్షులు గాదె పాక సునీల్, కొండా పూర్ గ్రామ శాఖ అధ్యక్షులు వడియాల సుధాకర్ రెడ్డి, ముది మాణిక్యం గ్రామ శాఖ అధ్యక్షులు కుతుబోద్దీన్, గాగిరెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు నరాల రాజయ్య, రామాంచ గ్రామ శాఖ అధ్యక్షులు వంటకాల సంపత్ రెడ్డి, వరి కోలు సంతోష్, రఘు బాబు, గుంటి అయిలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

### భగ్గుమన్న ధర్మపురి ముదిరాజ్ సంఘం



ధర్మపురి,జూన్ 26 మనం న్యూస్ : జర్నలిస్ట్ అజయ్ ముదిరాజ్‌నీ అసభ్య పదజాలంతో తిడుతూ,కొడుతున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పై ఉన్న ధర్మపురి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆగ్రహం వ్యక్తం చేశాయి. పాడి కౌశిక్ రెడ్డి శవ యాత్రకు పిలుపునిస్తూ సోమవారం రోజున స్థానిక అంబేద్కర్ చౌరస్తా దగ్గర పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముదిరాజులను అసభ్య పదజాలంతో తిట్టిన పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే బిఆర్ఎస్ పార్టీ నుండి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో ముదిరాజులందరూ ఏకమై బిఆర్ ఎస్ పార్టీ కి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. అయితే సోమవారం రాష్ట్రంలో ఉన్న ముదిరాజ్ నాయకులు,యువకులు పాడి కౌశిక్‌రెడ్డి కి ఫోన్లు చేస్తున్నడంతో పాడి కౌశిక్ రెడ్డి ఫోను ఎత్తడం లేదని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో పాడి కౌశిక్ రెడ్డిని వదిలిపెట్టి పరిస్థితటతి లేదని ముదిరాజ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజురాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో జర్నలిస్ట్ అజయ్ ముదిరాజ్ మాట్లాడుతూ పాడి కౌశిక్ రెడ్డి తనను,తన కులాన్ని అసభ్య పదజాలంతో అనరాని మాటలు అంటూ తీవ్రంగా కొట్టాడని చెప్పాడు.ముదిరాజులపై అనుషిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి బేషరతుగా యావత్ ముదిరాజులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని,ముదిరాజుల మనోభావాలకు బంగం కలిగించిన కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని లేదంటే ఆందోళన చేపడతామని గౌరవ అధ్యక్షులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జెట్టి రాజన్న,ఆకుల రాజేష్,బట్టు కృష్ణ,చొప్పరి శ్రీను,ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### ఆలుగడ్డ మాలల అలంకరణలో శ్రీ దుర్గాభవానీ



కరీంనగర్, జూన్ 26 (మనం న్యూస్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆషాడమాసం శాఖాంబరీ ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదుర్గాభవానీ అమ్మవారు ఆలుగడ్డల మాలల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు విశేష హారతులిచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి సభ్యులతోపాటు భక్తులు పాల్గొన్నారు.

### రత్నపూర్‌లో 100 శాతం ఇంటి పన్ను వసూల్లు పూర్తి



రామగిరి,జూన్ 26 మనం న్యూస్ : రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో 100 శాతం ఇంటి పన్ను వసూళ్లు పూర్తి అయ్యాయని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు,ఉపసర్పంచ్ దుబ్బాక సత్యరెడ్డి,ఎంపీటీసీ ధర్ముల రాజ సంపత్,సెక్రెటరీ పెండ్లి రమ్యలు తెలిపారు. 01.04.2022 నుండి 31.03.2023 వరకు ఇంటి పన్ను రూ.4,01,856 నాన్ టాక్స్ రూ.34,944 లు వసూలు చేయడం జరిగిందన్నారు. ఇంటి పన్ను సక్రమంగా కట్టినందుకు గ్రామస్థులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



### ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ గ్రామసభ

రామగిరి,జూన్ 26 మనం న్యూస్ : రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో ఉపపాధి హామీ పథకం పనులపై సోమవారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ గంట పద్మ వెంకట రమణరెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో డిఆర్ పి రమేష్ పాల్గొన్నారు.నవంబర్ 2020 నుండి మర్చి 2023 వరకు సంబంధించి ఉపాధి హామీ పథకం కింద రూ.85 లక్షల పనులు జరిగాయని,వీటిపై వారు ఆడిటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఎస్.శ్రీనివాస్,వార్డ్ సభ్యులు ఇరుగురాల కమల,బుస బాపన్న,బిరుదు భాగ్యలక్ష్మీ,ఫీల్డ్ అసిస్టెంట్ పెరవేన కొమురయ్య,కారోవార్ దొడిపేట కనకయ్య,మైదం శ్రవణ్,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ముళ్ల మొక్కలను పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

### ఎస్‌వోటు జిఎం జి.రఘుపతి



రామగిరి,జూన్ 26 మనం న్యూస్ ః స్వచ్ఛత పక్షోత్సవాలలో భాగంగా సోమవారం బంగ్లాస్ ఏరియాలో ముళ్ల మొక్కలు పొదలను తొలగించి శుభ్రపరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్జీ-3 యస్ ఓ టు జియం జి.రఘుపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా యస్ ఓ టు జియం మాట్లాడుతూ ఇంటి పరిసరాలను,సంఘ పరిసరిలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని,ఇళ్ల చుట్టూ ఉన్న పొదలను తొలగించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని లేని ఎడల పాముల వంటి విషసర్పాలు చేరి హాని కలిగిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిజియం ఐఈడి చంద్రశేఖర్,డిజియం సివిల్ పద్మరాజు,సివిల్ ఇంజనీర్లు సాయినాథ్,రాజేశం,డివైపియం కె.మారుతి పాల్గొన్నారు.

## రేషన్‌కార్డులు ఇచ్చేదెన్నడో..?

### ప్రభుత్వ పథకాలకు నోచుకోని అభాగ్యులు

### మండల కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు సాహెబ్‌హుస్సేన్



వీణవంక-జూన్ 26 (మనం న్యూస్): రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినప్పుడే రాష్ట్రప్రభుత్వం హడావుడిగా నామమాత్రంగా రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందని, గత 7సంవత్సరాలుగా రేషన్‌కా ర్డుదారుల కుటుంబసభ్యు లందరివి పేర్లు కార్డులో నమోదు చేయకపోవడం వల్ల ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ మండలంలోని కొందరు రేషన్‌కార్డుదారులు తిరుగుతున్నారని, అలాగే కొంతమంది విద్యార్థులు తమ పేరు రేషన్‌కార్డులో నమోదుకాకపోవడం వల్ల విద్యాసంస్థల యందు అనేక ఇబ్బందులుఎదుర్కొంటున్నారని మండల కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండి. సాహెబ్‌హుస్సేన్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు,బీసీ బంధు పథకాలకు అర్హులైన లబ్ధిదారుడికి రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధన విధించడం వల్ల అనేకమంది అర్హత ఉండి కూడా ఆ పథకాలకు నోచుకోలేదని, గృహలక్ష్మి పథకం కింద మంజూరు చేసే 3లక్షల రూపాయల ప్రభుత్వ సహాయానికి కూడా రేషన్‌కార్డు తప్పని సరి చేయడం వల్ల చాలా మంది నష్టపోతారని రేషన్ కార్డు లేకున్నా అర్హులైన వారికి 3లక్షల రూపాయల సహాయాన్ని అందించాలని. అర్హులకు తక్షణమే రేషన్‌కార్డులు మంజూరుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సిఐగా బాధ్యతల స్వీకరించిన సురేష్




కొమురంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 26 (మనం న్యూస్)ః అసిఫాబాద్ సిఐగా జవ్వాజి సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో సిఐగా విధులు నిర్వహించిన ఆయనను అసిఫాబాద్‌కు బదిలీ చేశారు. గతంలో ఇక్కడ పని చేసిన రాణా ప్రతాప్ ను ఎస్బీకి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సైలు రమేష్, గంగన్న, సందీప్, రాజేశ్వర్, సిబ్బంది నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్న

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు

- కాంట్రాక్ట్ కార్మికులను మోసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు
- తక్షణమే వేతనాలు పెంచాలి
- సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు




రామగిరి,జూన్ 26 మనం న్యూస్ ః తొమ్మిది సంవత్సరాల తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కార్మికులు అన్యాయానికి గురవుతున్నారని,నిత్యం విమర్శించుకుంటున్న టిఆర్ఎస్,బిజెపిలు సింగరేణి కార్మికుల విషయంలో ఇద్దరు కలిసి కాంటాక్ట్ కార్మికుల వేతనాలు పెంచకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. తక్షణం సింగరేణి కాంటాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. సింగరేణి కాంటాక్ట్ కార్మికుల పోరాట కార్యక్రమంలో భాగంగా సోమవారం సింగరేణి రామగుండం-3 ఏరియాలో కాంట్రాక్ట్ కార్మికుల పని ప్రాంతంలో వారిని కలిసి ఆయన మాట్లాడారు. మధు మాట్లాడుతూ 2022 జనవరి 19 నుండి పెండింగ్లో ఉన్న కనీస వేతన జీవోను విడుదల చేయకుండా కేంద్రంలోని బిజెపి నాయకత్వంలో ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శంచారు. 2013 లో కోలిండియా లో నిర్ణయించిన వేతనాలను సింగరేణిలో అమలు చేయించడంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ,బిజెపి నాయకులు,కేంద్ర మంత్రులు విఫలం చెందారని ఆయన విమర్శించారు. 2021 జూన్‌లో ఇచ్చిన జీవో నెంబర్ 22న గెజిట్ చేయకుండా,దానిలోని వేతనాలు కాంట్రాక్ట్ కార్మికులకు రాకుండా టిఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని విమర్శించారు. టిఆర్ఎస్ బిజెపి ప్రభుత్వాల వైఖరి మూలంగానే సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల యొక్క వేతనాలు పెరగడం లేదని ఆయన అన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు జరగకపోవడానికి టిఆర్ఎస్,బిజెపి నాయకులు బాధ్యత వహించాలని అన్నారు. సింగరేణి నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు తమ ఖాతాలో వేసుకున్నామని,ఎమ్మెల్యేలు కోట్ల రూపాయలు దండుకుంటున్నారని,కాంట్రాక్ట్ కార్మికుల శ్రమతో అధికారులకు అవార్డులు వస్తున్నాయని,రకరకాల ఉత్సవాల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారని,ఉత్పత్తి సాధన,తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా అధికారులకు,పర్మినెంట్ కార్మికులకు స్వీట్లు పంచిన సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు స్వీటు ముక్క కూడా ఇవ్వకుండా వివక్షత పాటిస్తున్నదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల సానుకూలంగా స్పందించాలని వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల యొక్క వేతనాలు పెరుగుదల కోసం జరుగుతున్న పోరాటంలో రాజకీయాలతీతంగా అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ఎస్‌సి కే ఎస్ బ్రాంచి సెక్రెటరీ చిప్పకుర్తి అరవింద్,సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హైమద్ పాషా,నరహరిరావు,ప్రభాకర్,సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నాయకులు తిరుపతమ్మ బానయ్య,రాణి,కుమారస్వామి,సిహెచ్ రమేష్,సిహెచ్ శ్రీనివాస్,ఆర్.రమేష్;ప్రసాద్,అజయ్,లక్ష్మణ్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ మహిళల జాతీయ హాకీ టోర్నమెంట్‌కు వేముల రిషిక, ఎస్.వైష్ణవిల ఎంపిక



హుజురాబాద్ రూరల్, జూన్ 26 (మనం న్యూస్)ః 13వ జూనియర్ మహిళల జాతీయ హాకీ పోటీలలో హుజురాబాద్ కు చెందిన హాకీ క్రీడాకారిణులు వేముల రిషిక , వైష్ణవి లు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుండి జులై ఏడవ తేదీ వరకు ఒడిస్సాలోని రూర్కెలా స్టేడియంలో ఈ పోటీలు జరుగనున్నాయి. తెలంగాణ టీముకు ప్రాతినిధ్యం వహించే టీంలో గత హాకీ క్రీడల్లో అత్యంత ప్రతిభ చూపిన వేముల రిషిక కెప్టెన్ గా ,ఎస్ వైష్ణవి క్రీడాకారిణిగా ఎంపికయ్యారు. తెలంగాణ జట్టుకు ఎంపిక కావడం పట్ల హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టిఎస్ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ,హాకీ జిల్లా ఉపాధ్యక్షులు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రెటరీ సర్దార్ సురేందర్ సింగ్, తెలంగాణ హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కళ్యాణి , హుజురాబాద్ హాజీ క్లబ్ గౌరవ అధ్యక్షులు తోట రాజేంద్రప్రసాద్ , అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్ ,సెక్రెటరీ ఉమామహేశ్వర్ ,కోచ్ టి శ్రీనివాస్ హాకీ క్లబ్ ఆర్గనైజర్ సెక్రెటర వేముల రవికుమార్ లు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ



పెద్దపల్లి, జూన్ 26(మనం ప్రతినిధి): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటమాధవరావుతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి ప్రజల ఇచ్చిన (45)ఆర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు.

## కస్తూర్బా విద్యాలయంలో పఠనోత్సవ కార్యక్రమం



వీణవంక-జూన్ 26(మనం న్యూస్): మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పఠనోత్సవ కార్యక్రమాన్ని పాఠశాల ప్రత్యేక అధికారిణి ఎలిగేటి లావణ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు పఠనం యొక్క ఆవశ్యకతను తెలుపుతూ గ్రంథాలయంలోని పుస్తాకాలను దారాళంగా చదివి తమ మేదస్సును పెంపొందించుకోవాలని పాఠశాల ఉపాధాయినీలు విద్యార్థినీలకు సూచించారు. ఈ సందర్భంగా లావన్య మాట్లాడుతూ తెలుగు,హిందీ, ఆంగ్లము పాఠ్యపుస్తకాలను ఏ విధంగా చదువాలో ఉపాధ్యాయులు చదివి వినిపించి విద్యార్థులచేత చదివించారని అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పుస్తకాల్లోని కథలు చదువడం జరిగిందన్నారు. విద్యార్థుల తరగతుల స్థాయి ఆధారంగా పుస్తకాలు ఇచ్చి వారిచే చదివించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీల బృందం ,విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెడు వ్యసనాలపై ఆలోచన వస్తే అమ్మానాన్నను గుర్తు చేసుకోవాలి

**మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలి**

**తల్లిదండ్రులు పిల్లలకు మంచి సంస్కారం నేర్పాలి**

**అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ**

పెద్దపల్లి, జూన్ 26(మనం ప్రతినిధి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌మాదకద్రవ్యాల వైపు ఆలోచన వస్తే మన అమ్మానాన్నలను గుర్తు చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోను వ్యసనాలకు ఆకర్షితులు కావద్దని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ, పెద్దపల్లి డిసిపి వైభవ్ గైక్వాడ్‌తో కలిసి అమర్చంద్ కళ్యాణ మండపం నుండి నిర్వహించిన ర్యాలీని జెండా ఊపీ ప్రారంభించారు. స్థానిక అమర్‌చంద్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో యువత మంచి, చెడు






తెలుసుకొని క్రమశిక్షణతో మెదులుతే అప్పుడే నిర్ధేశించిన లక్ష్యాన్ని సాధించి గొప్ప స్థానానికి చేరుకుంటారని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు లోనైతే కుటుంబంలో మన తల్లిదండ్రులు, మన కుటుంబీకులు పొందే దుఃఖం వివరిస్తూ కళాకారులు అధ్భుత ప్రదర్శన చేశారని, చెడు అలవాట్లకు మొదటి నుంచి దూరంగా ఉండాలన్నారు. నేటి యువత రేపటి భావి భారత పౌరులని, వీరిలో కొంతమంది డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. సమాజంలో పెరుగుతున్న సాంకేతికత కారణంగా చిన్న పిల్లలు సెల్ ఫోన్ వాడకంతో ఆలోచనా విధానం మారిపోతుందని, దీని వలన అనేక నష్టాలు వస్తున్నాయన్నారు. యువతకు సెల్ ఫోన్ వాడకం లేకుండా ఉంటే చాలా మంచిదని, ప్రతి ఇంట్లో పిల్లల ఫోన్ వాడకంపై తలి దండ్రుల పర్యవేక్షణ తప్పని సరిగాఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. యువత డ్రగ్స్‌తో పాటు, గుట్కా, గంజాయి, మాదక ద్రవ్యాలు, సిగరేట్ మొదలగు చెడు అలవాట్ల వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆలోచనా విధానం ఆలోచన శక్తి నశిస్తాయని తెలిపారు. భావితరాలు మాదక ద్రవ్యాలు పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలిసేందుకు తల్లిదండ్రులు ప్రతిరోజు పిల్లలకు తెలుగులోనే శతకాలు, పద్యాలు చెబుతూ వాటి భావం వివరించాలని, భాస్కర వేమన, సుమతి శతకాల వలన పిల్లల తో మంచి పరివర్తన, ఆలోచనా విధానం వస్తాయని అదనపు కలెక్టర్




పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, క్రమశిక్షణ చాలా కీలకమని, వీటిని ఎట్టి పరిస్థితులలో కోల్పోవద్దని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తాము కష్టాలు పడుతూ పిల్లలకు మంచి సౌకర్యాలు కల్పిస్తారని, వాటిని ఎట్టి పరిస్తితుల్లో దుర్వినియోగం చేసుకోవద్దని, మనం చెడు అలవాట్లకు గురైతే తల్లిదండ్రులు పడే క్షోభవర్ణనాతీతమని, ఇది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని యువత మెలగాలని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ హితవు పలికారు. జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్‌ఖాన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తన ప్రాణ స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మరణించారని, ఎంతో భవిష్యత్తు ఉన్నవారు మాదక ద్రవ్యాల అలవాటుకులోనై అర్థాంతరంగా జీవితాన్ని కోల్పోయారని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల నివారణ, డ్రగ్స్ నివారణ కోసం రూపొందించిన పోస్టర్లను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి, జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.ప్రమోద్‌కుమార్,సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ స్వప్న, డి.అడిక్షన్ సెంటర్ ప్రకృతి ఎన్.జి.ఓ.ఇంచార్జి ఏ రమాదేవి, కౌన్సిలర్ చారీ, పోలీస్ ఎక్సైజ్‌శాఖ అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ప్రమాద బాధితులకు చేయూత

**బస్సు ప్రమాద బాధితుల పరామర్శించిన తాళ్లపల్లి మనోజ్**



సుల్తానాబాద్, జూన్ 26(మనం న్యూస్): మండలంలోని కాట్నపల్లి వద్ద అదుపుతప్పి బస్సు ప్రమాదంలో గాయపడిన 35మంది బాధితులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదేశాల మేరకు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ బస్ ప్రమాద భాధితులను పరామర్శించి ఆసుపత్రిలో బిల్ మాఫీ చేయించి వారిని ఆదుకున్నారు. తీవ్రంగా గాయాలపాలైన 5గురు నిరుపేద ముస్లీం బాధితులను గుడ్‌లైఫ్ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి రూ.80వేల వరకు మాఫీ చేయించి, నిరుపేద బాధితురాలు సానియాకు ఆసుపత్రి ఖర్చు బిల్లును తన స్వంత డబ్బులు కట్టి మనోజ్‌గౌడ్ ఉదాసీనత చాటుకున్నారు. అలాగే రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పంపించిన రూ.10000లు ఆర్థిక సహాయం బాధితులకు అందించారు. ఆయన వెంట రామగుండం కో ఆప్షన్ మెంబర్ జావేద్, సామాజికి కార్యకర్త ఎండీ రఫీక్, రామగుండం బీఆర్ఎస్ నాయకులు పోలాడి శ్రీనివాస్‌రావులు ఉన్నారు.




## రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్ నియామకం

పెద్దపల్లి, జూన్ 26(మనం ప్రతినిధి): జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవెత్త జీజుల శ్రీకాంత్ హ్యూమన్ రైట్ కౌన్సిల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. జాతీయ చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేతి తిరుమల్‌రావు, హైదరా బాద్‌లో శ్రీకాంత్‌కు నియామక పత్రాన్ని అందించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతానని, అవినీతికి వ్యతిరేకంగా ప్రజల కోసం ఎళ్ల వేళలా ముందుంటానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన జాతీయ చైర్మన్, రాష్ట్ర అధ్యక్షులకు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

**సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్‌చీఫ్ భానుప్రసాద్‌రావు**



పెద్దపల్లి, జూన్ 26(మనం ప్రతినిధి): జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా కమిటి ఆధ్వర్యంలో ప్రభుత్వ శాసనమండలి చీఫ్ విఫ్ తానిపర్తి భానుప్రసాద్‌రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విఫ్ భానుప్రసాద్‌రావు మాట్లాడుతూ త్వరలోనే అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాల కొరకు జిల్లా కలెక్టర్ మరియు నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలోని జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు వచ్చేలా చూస్తానని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంక మహేష్, పైడాకుల భిక్షపతి, సుదర్శన్, బోయిని వినోద్, తిరుపతిరెడ్డి, మహేష్,రామదాసు, పరమేష్,గోపికృష్ణ,పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సాయుధ దళ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

రాజన్న సిరిసిల్ల, జూన్ 26 (మనం న్యూస్)ః రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళ పల్లి మండలం తాడూర్‌లోని జిల్లా పోలీస్ సాయుధ దళ కార్యాలయాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ అడ్మిన్ విభాగం, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం, హోమ్ గార్డ్ విభాగాలను పరిశీలించారు. కార్యాలయంలోని సిబ్బంది ఎవరెవరు ఎక్కడెక్కడ విధులు నిర్వహిస్తున్నారు, సెక్యూరిటి విభాగంలో ఎవరెవరు విధులు నిర్వహిస్తున్నారనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు వారి విధులకు సంబందించిన రికార్డులను పరిశీలించారు. ఆర్ఐ అడ్మిన్ స్టోర్ కు సంబందించిన స్టోర్ స్టాక్ లెడ్జర్, ప్రభుత్వ ప్రాపర్టీ రిజిస్టర్, లోకల్ పర్చేస్ రిజిస్టర్ ,యాక్షన్ బీడ్ రిజిస్టర్, కండామినేషన్ రిజిస్టర్ లతో పాటు డాగ్ స్క్వాడ్ రికార్డులను, పని తీరును పరిశీలించారు. బాంబ్ డిస్పోజల్ టీం కు సంబంధించిన రికారడ్స్ ను , టీం సభ్యులు వాడే పరికరాలను పరిశీలించారు. మోటార్ ట్రాన్స్‌పోర్టు విభాగానికి చెందిన వాహనాలను, వాటి పని తీరును తెలుసుకున్నారు. హోమ్ గార్డ్ సెక్షన్ కు సంబంధించి ఎవరెవరు ఎక్కడ పని చేస్తున్నారు అని తెలుసుకున్నారు. వారికి సంబంధించిన వెల్ఫేర్ క్యాష్ రిజిస్టర్, ఓ డి. క్యాష్ బుక్ రిజిస్టర్, అటాచ్మెంట్ రిజిస్టర్ ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సిబ్బందికి ఏమైనా విధులకు సంబంధించిన సమస్యలుంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సిబ్బంది సర్వీస్ కు సంబంధించి లీవ్ లు, సిక్, ప్రమోషన్, ఇఎల్ మొదలైనవి హెచ్ ఈ అర్ ఎల్ అప్లికేషన్ ద్వారా మాత్రమే అయ్యేటట్లు చూడాలని అందుకు సంబంధిత రైటర్స్ బాధ్యత



తీసుకోవాలన్నారు. సిబ్బంది అందరూ కూడా క్రమశిక్షణ తో విధులు నిర్వహించాలని,బందోబస్తు విధులలో,ఎస్కార్డ్ డ్యూటీల సమయంలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఎలాంటి పరిస్థితులను అయిన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు కుమారస్వామి, రజినీకాంత్, యాదగిరి, ఆర్.ఎస్.ఐ లు శ్రీనివాస్, శ్రవణ్, రమేష్, సాయి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిరోధక పోస్టర్ ఆవిష్కరణ



ఇల్లంతకుంట, జూన్ 26 (మనం న్యూస్)ః రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ చంద్రకళ మాట్లాడుతూ ఈ రోజుల్లో 10వ తరగతి, ఇంటర్ చదివే పిల్లలు, యువత మాదకద్రవ్యాల కు అలవాటు పడుతున్నారని దీంతో వారు శారీరకంగా మానసికంగా దెబ్బతింటున్నారన్నారు. తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు అలాంటి వారిని గమనించి, కౌన్సిలింగ్ ఇప్పించాలన్నారు. యువత ఇలాంటి చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్య కళ, శ్రీలేఖ దేవి, ఐసిపిఎస్ సంపత్, అంగన్వాడీ టీచర్లు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

## ఘనంగా సాహూ మహారాజ్ జయంతి వేడుకలు




కొమురంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 26 (మనం న్యూస్)ః భారత దేశ రిజర్వేషన్ల పితామహుడు, ఛత్రపతి శివాజీ మహరాజ్ వారసుడు, ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి వేడుకలను అసిఫాబాద్ ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహూ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసిన నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోటుపెల్లి జైరాం, ఉపాధ్యక్షుడు కోలే బిక్కాజి, అసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు బోర్కుటే తిరుపతి, ఉపాధ్యక్షుడు బోటుపెల్లి అన్నారావు, ప్రధాన కార్యదర్శి నాగపూరి మారుతి,ఆత్మ చైర్మన్ కురత్కర్ రమేష్,కోశాధికారి అసిఫాబాద్ మండల అధ్యక్షుడు గేదెకార్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం




కరీంనగర్, జూన్ 26 (మనం న్యూస్)ః లయన్స్ క్లబ్ ఆఫ్ రాజరాజేశ్వరి కరీంనగర్ సర్వసభ్య సమావేశం సోమవారం క్లబ్ అధ్యక్షురాలు ఊకంటి సంపతి కుమారి అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా 2023 –2024 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా ఎస్.సరళ, సెక్రెటరీగా పిన్నింటి సంగీత, కోశాధికారిగా డి.స్వాతి, ఉపాధ్యక్షులుగా నరహరి లక్ష్మారెడ్డి, శశికళ, కార్యదర్శిగా ఆర్. రేణుకలతో పాటు నూతన సభ్యులను లయన్స్ క్లబ్ ఉప గవర్నర్ సింహరాజు కోదండరాం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ ఎం.వెంకటరమణారెడ్డి, ఆర్ సిసి లక్ష్మయ్య, కెప్టెన్ మధుసూదన్ రెడ్డి, రాళ్ల బండి శంకర ప్రసాద్ రెడ్డి, కోమళ్ల రాజేందర్ రెడ్డి, బి.నరసింగరావు, యాదగిరి శేఖర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల పట్ల దృష్టి సారించాలి

### సుడా చైర్మన్ రామకృష్ణారావు



తిమ్మాపూర్, జూన్ 26 (మనం న్యూస్)ః యువత క్రీడల పట్ల దృష్టి సారించాలని సుడా చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణారావు పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణిగుంట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేష్ ఆధ్వర్యంలో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి క్రికెట్ కప్ క్రీడ పోటీలను నిర్వహించారు. సోమవారం నిర్వహించిన క్రీడ పోటీల ముగింపు కార్యక్రమానికి రామకృష్ణారావు ముఖ్య అతిధిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మాపూర్ మండల యువత పెద్ద సంఖ్యలో క్రీడల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మండల స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గెలుపోవటములను సమానంగా స్వీకరించి క్రీడల్లో రాణించాలని అన్నారు. అనంతరం విజేతగా నిలిచిన నుస్తులాపూర్ టీంకు ట్రోఫీతో పాటు 25 వేల నగదు బహుమతి, రెండవ స్థానం లో నిలిచిన రేణిగుంట టీంకు 15 వేల నగదు, ట్రోఫీ అందజేశారు. నెలరోజుల పాటు సాగిన టోర్నమెంట్ లో 62 టీంలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఇనుకొండ జితేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, పార్టీ నాయకులు ఎలుక ఆంజనేయులు, మల్లెత్తుల అంజయ్య, బేతి రాజేందర్, బొంగాని రమేష్, టోర్న మెంట్ నిర్వాహకులు శ్రీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ సభను విజయవంతం చేయాలి



కొమురంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 26 (మనం న్యూస్)ః ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని, ఆయన పాల్గొననున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. కెసిఆర్ పర్యటన సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిఆర్ఎస్ శ్రేణులు సమన్వయంతో పని చేసి సీయం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. భారీ బహిరంగ సభకు ప్రజలు, బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా చూడాలని నాయకులకు సూచించారు. ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## స్వతంత్ర సమరయోధుల చరిత్ర రాయడం అభినందనీయం

### ఎస్సై చంద్రకుమార్



మందమర్రి, జూన్ 26 (మనం న్యూస్)ఃదేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన మహనీయుల స్ఫూర్తిని నేటి యువ తరానికి అందించేందుకు రిటైర్డ్ ఆర్మీ సింగరేణి సెక్యూరిటీ గార్డ్ రాజేష్ పివ్హాల్ పుస్తకాలు రాయడం అభినందనీయమని మందమర్రి పట్టణ ఎస్ఐ చంద్రకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో రాజేష్ పివ్హాల్ రాసిన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాజేష్ రాణి వివాహ మహోత్సవ సందర్భంగా స్వతంత్ర సమరయోధుల స్ఫూర్తి పుస్తకాలను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఆయన రాసిన పుస్తకాలలో బూంద్ బూంద్ ఖున్ దేగా, ధర్తి పర్‌పరి అనే రెండు పుస్తకాలను హిందీలో రాసి నేటి యువతరానికి అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. రాజేష్ ఇంతకు ముందు చాతి పర్జావ్ చట్టానికి, జనున్ ఉన్ కా , బులానా జాయేగా అనే పుస్తకాలను రాసి యువతకు అంకితం చేశారని తెలిపారు. సింగరేణిలో సెక్యూరిటీ గా విధులు నిర్వహిస్తున్న రాజేష్ ఎవరైనా దాతలు సహకరిస్తే వాటిని తెలుగులో అనువదించుటకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. మహనీయులపై పుస్తకాలు రాయడం దేశంపై ఉన్న మక్కువేనని ఆయన కొనియాడారు. రాజేష్ రాణి దంపతులకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ పిహాల్ మిఠాయిని పంపిణీ చేశారు.

# గ్రూప్-4 పరీక్షలు సజావుగా జరపాలి

## కరీంనగర్ కలెక్టర్ కర్ణన్

కరీంనగర్ బ్యూరో, జూన్ 26 (మనం న్యూస్): జూలై 1న నిర్వహించనున్న గ్రూప్ 4 పరీక్షలను ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా జరపాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వి. కర్ణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పోలీస్, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల యాజమన్యాలు, విద్యాశాఖ అధికారులతో గ్రూప్-4 పరీక్షల నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూలై 1న నిర్వహించనున్న గ్రూప్4 పరీక్షలకు హాజరుకానున్న 54వేల19 మంది అభ్యర్థుల కొరకు 154 మంది పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందుకొరకు 154 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 154 మంది లైజనింగ్ అధికారులు, 154 ఐడెంటిఫికేషన్ అధికారులతో పాటు 32 మంది రూట్ అధికారులను నియమించినట్లు వివరించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్



కమీషన్ ఆదేశాల మేరకు పరీక్షలు జరగాలని అన్నారు. జిల్లాలోని పరీక్షా కేంద్రాలన్నింటిలో ఉదయం 9:45, మధ్యాహ్నం 2:15 గంటల తరువాత గేట్లను మూసివేసి ఎవరిని అనుమతించరాదని ఆయన ఆదేశించారు. పరీక్షను రాయడంలో ఇబ్బందులు ఉన్న వారి కోసం 82 మంది సహాయకులను నియమించడం జరిగిందన్నారు. ఎగ్జామ్ మెటిరియల్ ను ట్రెజరిలో భద్రపరచడం జరుగుతుందని, అక్కడి నుండే ఉదయం మధ్యాహ్నం వేరువేరుగా మెటిరీయల్ తీసుకువెళ్లాలని సూచించారు. హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి వంటి ప్రాంతాల్లోని కేంద్రాలకు నిర్దేశించిన సమయంలోగా మెటిరీయల్ ను చేర్చేలా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి అదనపు వాహనాలను, సిబ్బంది, స్కైబ్ లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష సమయంలో ఎటువంటి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని, దూరప్రాతాల నుండి వచ్చే వారికొరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాలన్నింటిలో ఖచ్చితంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసి రికార్డు చేయించాలని, సిసి కెమరాలు లేనట్లయితే వీడియో రికార్డు చేయించాలన్నారు. వికలాంగుల కొరకు టిఎస్పిఎస్సి సూచించిన మేరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గ్రౌండ్ ఫ్లోర్ లోనే పరీక్షను రాసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతికేంద్రంలో ఆశా ఎ ఎన్ ఎం ల ద్వారా మెడికల్ క్యాంపులను నిర్వహించాలని సూచించారు. ఇన్ విజిలెట్లరుగా కేవలం ఆయా కేంద్రాల టీచింగ్ స్టాఫ్ ను మాత్రమే నియమించాలని ఆదేశించారు. అభ్యర్థి ఎడమ చేతి బోటన వేలి ఆధారంగానే బయోమెట్రిక్ విధానంతో హాజరు నమోదు తీసుకోవాలని, పరీక్షకు ముందు జబ్లింగ్ విదానం గురించి అభ్యర్థులకు అవగాహన కల్పించాలని, చీఫ్ సూపరింటెండెంట్, లైజనింగ్ అధికారి మినహా ఎవరు కూడా పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష ముగిసే వరకు ప్రశ్నాపత్రాలు సామాజిక మాద్యమాల



ద్వారా గాని మరేఇతర విధంగా కూడా బయటకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ పోలీస్ శాఖ పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, కేంద్రాల వారిగా అవసరమైన సిబ్బందిని గురించి ముందస్తుగా చూసుకొవాలని, తక్కువగా ఉన్న చోట ఎక్సైజ్, అటవి సిబ్బందిని వాడుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, ప్రోటోకాల్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తవహించాలన్నారు. పరీక్షను చాలెంజ్ గా తీసుకోని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ ప్రియాంక, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డిఓలు ఆనంద్ కుమార్, హరిసింగ్, ట్రైని కలెక్టర్లు నవీన్ నికోలస్, లెనిన్ వత్సల్ టోప్పో, అడిషనల్ డిసిపి శ్రీనివాస్, హుజురాబాద్ ఎసిపి వెంకట్ రెడ్డి, ట్రైని ఐపిఎస్ మహేష్, డిఆర్డిఓ పిడి శ్రీలత, ఇతర అధికారు పాల్గొన్నారు.

# ఘోరా రోడ్డు ప్రమాదం

## బస్సుబోల్తా...ఇరువురికి గాయాలు

సుల్తానాబాద్,జూన్26(మనం ప్రతినిధి): సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అటోను తప్పించబోయి డీవైడర్‌ను డీ కొట్టి బోల్తాపడిన సంఘటన కాట్నపల్లిలో చోటు చేసుకుంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ముస్లీం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా కాట్నపల్లిలో రోడ్డు క్రాస్ చేస్తున్న అటోను తప్పించబోయి బస్సు బోల్తా పడింది. బస్సులో 40మందికి పైగా బస్సులో ప్రయాణం చేస్తున్నారు. ఈప్రమాదంలో కొంత మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా మరి కొంత మందికి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. సంఘటనా స్థలానికి పెద్దపల్లి ఏసీపి ఎడ్ల మహేష్, ఎస్సైలు అనిల్‌కుమార్, జగదీష్, సుల్తానాబాద్ ఎస్సై విజయేంద్రర్‌రెడ్డి పరిశీలించి గాయాల పాలైన ప్రయాణికులను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ప్రమాదం కావడంతో దాదాపు రెండు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు బస్సును క్రేన్ల సహాయంతో బస్సును రోడ్డుపై నుండి తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించి ప్రయాణికులు ప్రయాణికులకు ఇబ్బందులు కాకుండా చూశారు. బస్సు ప్రమాదం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తక్షణమే హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని



సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్యులతో మాట్లాడి గాయపడిన వారిని మెరుగైన చికిత్స అందించాలని కోరారు. గాయపడిన వారిని పరామర్శించి ఆధైర్యపడవద్దని మనోధైర్యాన్ని ఇచ్చారు.





# సుపరిపాలన, పేదల సంక్షేమమే ధ్యేయంగా మోడీ పాలన

## బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం



చిగురుమామిడి, జూన్ 26 (మనం న్యూస్): దేశంలో సుపరిపాలన అందించడంతో పాటు పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోడీ పాలన కొనసాగుతోందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, చిగురుమామిడి మండల ఇంచార్జి సాయిని మల్లేశం తెలిపారు. నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల పాలన సందర్భంగా బిజెపి చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్‌లో గడప గడపకు బిజెపి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లేశం మాట్లాడుతూ మోడీ పాలనలో భారత దేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇటు ఆర్థికంగా, అటు రక్షణా పరంగా బలోపేతమై, రానున్న రోజుల్లో ప్రపంచంలో మేటి దేశంగా ఆవిర్భవింపజేసే దిశగా నరేంద్ర మోడీ పాలన సాగిస్తున్నారని తెలిపారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధి పట్ల బిజెపి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా 9.6 కోట్ల ఎల్పీజీ కనెక్షన్ల పంపిణీ, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా 11.72 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం, ప్రధాన మంత్రి ముద్ర యోజన ద్వారా 27.6 కోట్ల మంది మహిళలకు రుణాలు, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన ద్వారా 3.03 కోట్ల మంది మహిళలకు సహాయం, మహిళా ఉద్యోగులకు 26 వారాల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పైడిపెల్లీ శ్రీనివాస్,మండల ఉపాధ్యక్షులు బుదర్ది మహేందర్, నాయకులు పొన్నం శ్రీనివాస్, గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి లోకిని ఆంజనేయులు, బిజెవైఎం మండల ప్రధాన కార్యదర్శి దాసరి హరికృష్ణ, బూత్ అధ్యక్షులు పెసరి హరీష్, పాల్గొన్నారు.